క్లుప్తంగా

ప్రారంభమైన ఉరుసు ఉత్సవం


విద్యుత్ వెలుగుల్లో జమాలుల్లా బాబా దర్గా

రాయచోటి (జగదాంబసెంటర్) : పాత రాయచోటిలో వెలసివున్న హజరత్ జమాలుల్లా బాబా ఉరుసు మహోత్సవాలు ఆదివారం అంగ రంగ వైభవంగా ప్రారంభమైనట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. 15వ తేదీ ఆదివారం రాత్రి గంధం ఊరేగింపుతో ఉరుసు ప్రారంభమైంది. అదే విధంగా ఈ నెల 16న మధ్యాహ్నం దర్గా ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం, అదే రోజు సాయంత్రం ఉరుసు మహోత్సవం జరగనుంది. 17న తహలీల్ ఫతేహాతో ఉరుసు ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు హిందూ, మహమ్మదీయ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని దర్గా కమిటీ సభ్యులు తెలియజేశారు.

రేపటి నుంచి ధార్మిక కార్యక్రమాలు

రాజంపేట టౌన్ : టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి మంగళవారం నుంచి ఐదు రోజులపాటు పట్టణంలోని మన్నూరు అరుంధతివాడలోని మాతమ్మ ఆలయంలో ధార్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు టీటీడీ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6:30 గంటల నుంచి ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. మంగళ, బుధ, గురువారాల్లో రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణచే ధార్మికోపన్యాసం ఉంటుందన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న భక్తులచే భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. శుక్రవారం స్థానిక మహిళలచే అమ్మవారికి కుంకుమార్చన, శనివారం భజన కార్యక్రమాలు ఉంటాయని గోపిబాబు తెలియజేశారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

జడ్జి పసుపులేటి శంకర్‌కు ఆహ్వానం

నందలూరు : రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్‌ను కడపలోని కోటిరెడ్డి రామసుబ్బమ్మ మహిళా కళాశాలలో ఉపన్యసించాలని ప్రిన్సిపల్ డాక్టర్ సలీమ్ బాషా ఆహ్వానించారు. ఈనెల 17న కళాశాలలో విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, జాతీయ సమైక్యతలు గురించి తెలియజేయాలని ప్రిన్సిపల్ కోరారు.

అన్నదానం

రాజంపేట : సమాజసేవ చేయడం మహాభాగ్యమని లవ్ అండ్ కేర్ ట్రస్ట్ అధ్యక్షుడు కార్తిక్ రెడ్డి, కోశాధికారి మునిచంద్ర అన్నారు. ఆదివారం రాజంపేట వైఎస్సార్ సర్కిల్‌లో పేదలకు అన్నదానం కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శనివారం పేదలు ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమాలను చేస్తుంటామన్నారు. తమ ట్రస్ట్ ద్వారా అనాథ వృద్ధులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


రోగులకు వైద్యం అందిస్తున్న డాక్టర్లు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కె.బుడుగుంటపల్లి గ్రామంలోని కన్యగుంట ఎస్టీకాలనీలో అయ్యప్పస్వామి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ మణికంఠ, హారికజ్యోతిలు వైద్యాన్ని అందించారు. అలాగే చికిత్సకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు 50 మంది వైద్య సేవలు పొందారు.

రామాపురంలో కంటి వైద్య శిబిరం

రామాపురం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్, అరవింద ఐ ఆసుపత్రి తిరుపతి ఆధ్వర్యంలో కంటి పరీక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని దాదాపు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఆపరేషన్ అవసరమైన 40 మందిని తిరుపతి అరవింద ఐ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించడం జరుగుతుందన్నారు.

జూదరుల అరెస్టు

రామాపురం : సుద్దమళ్ల పంచాయతీ దూదేకుల పల్లె సమీపంలో పొదల్లో జూదం ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు మండల ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి దాడులు నిర్వహించారు. దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,670లు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

మాజీ వైస్ సర్పంచ్ మృతి

రైల్వేకోడూరు అర్బన్ : శెట్టిగుంట ఎస్.కొత్తపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.రాజయ్య గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. వైస్ సర్పంచ్‌గా పంచాయతీలోని పేదలకు అనేక సేవలు అందించారు. ఈయన మృతదేహానికి జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, జెడ్పీటీసీ రత్నమ్మ, పలువురు మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల కల చెదిరిపోయింది



ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తే మెడిసిన్ సీటు లభించక పేద విద్యార్థులు డాక్టర్ కావాలన్న కల చెదిరిపోతుంది. ఫ్రీ సీటు వస్తే పేద విద్యార్థులు డాక్టర్ అయ్యి పేద రోగులకు ప్రత్యేక శ్రద్ధతో వైద్యం అందించగలరు. యూనివర్శిటీకి సీట్లు మంజూరు చేయకూడదు అంటూ ప్రభుత్వం లేఖ రాయడం దుర్మార్గమైన చర్య. అలానే ఈ అంశంపై వైద్యారోగ్య మంత్రి స్పందన దారుణం. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేలా ఆయన వ్యాఖ్యలు కనిపించాన్నారు. ప్రభుత్వం నిర్మించిన కళాశాలను బయట వ్యక్తులకు కట్టబెడితే ఊరుకునేది లేదు. ప్రైవేటీపరం చేసే ఆలోచనను విరమించుకోవాలి. లేకుంటే పేద విద్యార్థుల ఉసురు తగలక తప్పదు.

– ఎస్.నాగేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట టౌన్

పేద విద్యార్థులకు నష్టం



రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ప్రభుత్వ రంగంలో వుంటే పేదవిద్యార్థులకు మేలు జరుగుతుంది. వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయాలనుకునే ఆలోచన చేయడం అన్యాయం. పేదలకు వైద్య విద్య అందని ద్రాక్షగా మార్చేందుకు చేసిన ప్రయత్నాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలి. విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటే వీలైనంత మంది విద్యార్థులకు న్యాయం చేకూరుతుంది. పీపీపీ విధానంతో విద్యార్థులకు భారీ నష్టం. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వాలైన వారు తీసుకున్న నిర్ణయాలు ఏవైనా సగటు విద్యార్థులకు, సమాజానికి మేలు కలిగేలా ఉండాలే కానీ బాధించకూడదు.

– వి.విజయకుమార్‌రెడ్డి, నీట్‌రాసిన విద్యార్థిని తండ్రి, సంబేపల్లి

తాగునీటి కష్టాలు..


వ్యవసాయ క్షేత్రంలోని బోరుబావి వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికుడు

వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మండల వాసులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో స్కీమ్ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రజలు నీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొందరు ట్యాంకర్ల ద్వార నీటిని తెచ్చుకుంటుండగా, మరికొందరు సుదూర ప్రాంతాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలలో బోర్ల వద్దకు వెళ్లి బిందెలు, డ్రమ్ములతో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుకొంటున్నారు. – సంబేపల్లి


ఆటోలో ఉన్న డ్రమ్ముల్లోకి నీటిని పోస్తున్న మండలవాసి

నిమజ్జనాలలో రాజకీయ పాటలు వద్దు

సుండుపల్లె : వినాయక నిమజ్జనం చేసేవారు ఇతరులకు ఆటంకాలు కల్గించే విధంగా రాజకీయాలకు సంబంధించిన పాటలు గానీ, రాజకీయ పార్టీల ప్రసంగాలు గానీ, సౌండ్ సిస్టంలలో అధిక సౌండ్ పెట్టరాదని ఎస్ఐ ఎం.శ్రీనివాసులు తెలియజేశారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి సౌండ్ సిస్టం సీజ్ చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

మురుగునీరు.. పట్టించుకోరు

- బస్టాండ్ వద్ద రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ
- వాహన రాకపోకలతో స్థానికులపై ఎగురుతున్న మురుగు
- నిర్లక్ష్యంగా అధికారుల తీరు


బస్టాండ్ మలుపు వద్ద నుంచి గాలివీడు రోడ్డుపై పారుతున్న మురుగునీరు


డ్రైనేజీ నీటిని దాటుకుని వెళుతున్న ప్రయాణికులు

రాయచోటి టౌన్ : ప్రయాణీకులతో నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా తయారైంది. పారిశుధ్య సిబ్బంది నిర్వాకమో.. అధికారుల అలసత్వమో కానీ ప్రజలకు ఇబ్బందులు తీసుకురావడమే కాక రోగాల బారిన పడేలా చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రులు ఒకే చోట ఉంటాయి. అలాంటి ముఖ్యమైన చోట బస్టాండ్ నుంచి డ్రైనేజీ లింక్‌ను కలిపే రెండు మ్యాన్ హోల్ మూసుకపోయాయి. దీంతో బస్సులు ఎక్కుతున్న మలుపు వద్ద డ్రైనేజీ నీరు బస్టాండ్ నుంచి బయటికి వచ్చి పండ్ల వ్యాపారాల సముదాయాల మలుపు వద్ద, గాలివీడు రోడ్డులోని రాజధాని హోటల్ ఎదురుగా ఇలా ఎక్కడైతే డ్రైనేజీ కాల్వలకు లింక్‌లు కలిపే మ్యాన్‌హోల్ వద్ద మురుగునీరు (మలమూత్రాలతో కలసిన మురుగునీరు) పొంగి బయటకు ప్రవహిస్తోంది. ఈ కారణంగా వాహనాల రాకపోకల కారణంగా మురుగునీరు ఈ మార్గం గుండా వెళ్లే ప్రయాణీకులు, పాదచారులుపై పడుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకులు, సిబ్బంది మూత్ర విసర్జన (మరుగు దొడ్లు) గదులు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే మలమూత్రాలు బయటకు పంపించేందుకు బస్సులు బస్టాండ్‌లోకి ఎక్కే మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా రెండు మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి గాలివీడు రోడ్డులోని మలుపులోని డ్రైనేజీలోకి కలిపారు. వీటిని నిర్వహించే వారికి డబ్బులు వసూలు చేసే దానిపై ఉన్న శ్రద్ధ శుభ్రపరిచే దానిపై లేదని ప్రయాణీకులు వాపోతున్నారు. పది రోజులకు ఒకసారైనా క్లీనింగ్ చేస్తుంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని వారు ఆరోపిస్తున్నారు. మురుగునీటితోపాటు అందులో ఉన్న మలము కూడా సంప్‌లో నిండుతోంది. అందులోనే మూత్రం, డ్రైనేజీ నీటితో కలసి ఇలా మ్యాన్‌హోల్ ద్వారా బయటకు పొంగిపొర్లుతోంది. వివిధ పనుల మీద వస్తున్న పట్టణవాసులపై ఈ మార్గన వెళ్లే వాహనాలు వల్ల మురుగునీరు ఎగిరి పడుతుండటం వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. తాత్కాలిక పనులతో ఉపయోగం లేదని అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై డీఎం ధనుంజయను వివరణ కోరగా దీనిపై పూర్తి స్థాయి విచారించి శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నిస్తామన్నారు.

మున్సిపల్ చైర్మన్, డీసీసీబీ మాజీ డైరెక్టర్‌లకు పరామర్శ


మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డిలు

రాయచోటి : రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఎస్.వెంకట్రామిరెడ్డిలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీకాంత్ రెడ్డి, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలు పరామర్శించారు. రాయచోటి మున్సిపల్ చైర్మన్ తండ్రి ఇలియాస్ బాషా అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డిలను ఆదివారం వారి గృహాలకు వెళ్లి పరామర్శించారు. ఇలియాస్ బాషా మృతిపట్ల వారు సంతాపం తెలిపి, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. అదే విధంగా వెంకటరామిరెడ్డి ఆరోగ్య పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హారూన్, నియోజకవర్గ బిసి సెల్ కన్వీనర్ నాగరాజు యాదవ్, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు ఉన్నారు.

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి పట్టణం కొత్తపేట రామాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిరేవుల శంకర్‌రెడ్డి సోదరుని మనువడి కేశఖండన కార్యక్రమంలో, లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్నపురెడ్డి నాగేంద్రరెడ్డి కుమార్తె కేశఖండన కార్యక్రమంలో వైఎస్సార్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డిలు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

త్యాగనిరతికి ప్రతిబింబం మహమ్మద్ ప్రవక్త జీవితం


గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాయచోటి (జగదాంబసెంటర్) : త్యాగనిరతికి ప్రతిబింబం మహమ్మద్ ప్రవక్త జీవితమని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ అత్యంత పవిత్రమైన రోజన్నారు. మహమ్మద్ ప్రవక్త జీవితం మానవజాతికి ఆదర్శమన్నారు. ఆయన మార్గం అందరికీ అనుసరనీయం అంటూ తెలియజేశారు. మత సామరస్యం, సోదరభావం, ఇతరుల పట్ల ప్రేమ ప్రవక్త చూపిన మార్గాలని, ఆ మార్గాలలో ప్రజలందరూ నడవాలని ఈ సందర్భంగా కోరారు. మిలాద్ ఉన్ నబీ పండుగ ప్రజల్లో సోదరభావం, సహనం, కరుణ, ఐక్యతలను మరింత పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శ్రీకాంత్‌రెడ్డి మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రముఖ రంగస్థల నటుడు వేంపల్లె బాషా మృతి


వేంపల్లె బాషా మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్: ప్రముఖ రంగస్థల నటుడిగా జిల్లా ప్రజలకు సుపరిచితులైన వేంపల్లె బాషా (72) ఆదివారం మండలంలోని సున్నపురాళ్లపల్లెలో ఆయన స్వగృహంలో మృతి చెందారు. బాషా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవారు. వేంపల్లె బాషా మృతి చెందిన విషయం తెలియగానే ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సున్నపురాళ్లపల్లెకు వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ వేంపల్లె బాషా బీఎస్ఎన్ఎల్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న సమయంలోనూ కళారంగంపై ఉన్న మక్కువతో రంగస్థల నటుడిగా విభిన్నపాత్రలు పోషించి ప్రేక్షకులను అలరించి జిల్లా వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. నాటకరంగానికి ఆదరణ తగ్గిపోతున్న సమయంలో ఆయన నాటకరంగాన్ని బతికించేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లపై విచారణ జరపాలి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట గిరిజన గురుకుల పాఠశాలపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ఆదివారం డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులచే వెట్టిచాకిరీ చేయిస్తూ బయటకు తెలియకుండా మభ్యపెట్టడం దారుణమన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా ఇంజినీర్స్‌డే


మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఏఐటీఎస్ సిబ్బంది

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీలో ఆదివారం ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డా.నారాయణ, డీన్ సుబ్బారావులు పాల్గొన్నారు. మోక్షగుండం విశ్వేశరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా పర్యావరణపరంగా, సామాజికంగా స్థిరత్వాన్ని సాధించాలంటే ఇంజనీర్ పాత్ర ముఖ్యమైనదన్నారు. ఈ విషయాన్ని యువ ఇంజనీర్లు దృష్టిలో పెట్టుకొని ఆ మార్గంలో పురోగతి సాధించాలన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నమండెం : మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మానవత ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. రాయచోటిలోని వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారు వైద్య సేవలందించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జానకిరామ్ సుమారు 80 మంది రోగులకు వైద్యం, మందులను అందించారు. అదే విధంగా డాక్టర్ స్వాతిరెడ్డి, డాక్టర్ హరిశ్రీ, స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ భువనేశ్వరి రోగులకు వైద్యం అందించారు. శిబిరంలో 200 మందికి పైగా రోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో జయచంద్రారెడ్డి, నజీర్‌బాషా, రెడ్డప్పరెడ్డి, పెద్దిరెడ్డి, కృష్ణారెడ్డి, రమణ, శేఖర్‌రెడ్డి, నారాయణప్ప పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు


సుండుపల్లె: నాగారపమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


సిద్దవటం: పూజలందుకున్న ఇరుగులమ్మ


సంబేపల్లె: భక్తులకు దర్శనమిస్తున్న నల్లగంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సుండుపల్లె : మండల పరిధిలోని బండకా ఈడిగపల్లిలో వెలసిన శ్రీ నాగారపమ్మను ఉదయాన్నే పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నాగారప్ప విరాజిల్లుతోంది. ప్రతి ఆదివారం చుట్టుపక్కల మండలాలు, జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. పలువురు అమ్మవారిని దర్శించుకుని, బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సిద్దవటం : మండలంలోని మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద వెలసిన ఇరుగులమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించామని ఆలయ పూజారి వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన తదితర పూజలను చేశామని తెలియజేశారు.

వసంతాలు చల్లుకుంటూ.. గణేశుడిని సాగనంపుతూ..

- వినాయకుడిని గంగమ్మ ఒడికి చేరుస్తున్న నిర్వాహకులు
- ఆకట్టుకున్న బాణాసంచా పేలుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు


పెనగలూరు: కొత్తపల్లిలో ఊరేగుతున్న గణేశుడు


గాలివీడు: నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


సిద్దవటం: ఊరేగింపుగా వెళుతున్న గాండ్లవీధికి చెందిన వినాయక విగ్రహం


లక్కిరెడ్డిపల్లె: నిమజ్జనానికి తరలివెళ్తున్న పెద్దగుండ్ల రాచపల్లి గణనాథుడు


చిన్నమండెం: శ్రీనివాసపురం రిజర్వాయర్ వద్ద కోలాహలంగా సాగుతున్న నిమజ్జన ప్రక్రియ

పెనగలూరు : కొత్తపల్లి గ్రామంలో తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న వినాయకుడు ఆదివారం ఘనంగా నిమజ్జనం చేశారు. మండపం నుంచి క్రేన్ ద్వారా వాహనంపై ఎక్కించి పురవీధులలో ఊరేగించారు. వినాయక స్వామి లడ్డూ వేలం రూ. 2.20లక్షలు పలికింది. ఎస్ఆర్ పురం వద్ద గుంజన నదిలో క్రేన్ ద్వారా పోలీసుల బందోబస్తు నడుమ ఆదివారం సాయంత్రం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఉట్టి కొట్టు కార్యక్రమంలో యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కాగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించినందుకు గాను కమిటీ సభ్యులను ప్రసన్నకుమార్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

సిద్దవటం : మండల కేంద్రంలోని గాండ్లవీధిలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహానికి ఆదివారం ఘనంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి విగ్రహాన్ని పూలతో అలంకరించిన ట్రాక్టర్‌లో కొలువు తీర్చి గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో వేసిన కోలాటం భజనలు ఆకట్టుకున్నాయి.

గాలివీడు : మండలవ్యాప్తంగా ఎనిమిది రోజుల పాటు విశేష పూజలందుకున్న విఘ్ననాయకుడు శనివారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా పట్టణంలోని బస్టాండ్, గేటు నాలుగురోడ్ల కూడళ్ల వద్ద మధ్యాహ్నం నుంచి కోలాహలం కనిపించింది.

రాయచోటి టౌన్ : వినాయక నిమజ్జనాలు ఎంతో భక్తి శ్రద్ధలతో అనోదంతప్సలతో, ఎంతో సంబరంగా నిర్వహించారు. ఆదివారం 9వ రోజు కావడంతో ఎక్కువ శాతం నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. రాయచోటి పట్టణ, రూరల్ పరిధిలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన గణనాథులను నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా గ్రామాలలో ఇంటింటా స్వామివారిని హారతులు, పూజలు నిర్వహించి స్వామి వారికి బిందెడు నీళ్లతో వరపోశారు.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉన్న గణనాథులను ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో శ్రీనివాసపురం రిజర్వాయర్ వద్ద జరిగిన నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లి : గణపతి బప్పా మోరియా.. గణేష్ మహరాజ్‌కు జై అనే నినాదాలతో మండలంలోని లక్కిరెడ్డిపల్లి మూడు రోడ్ల కూడలి, గుడ్లవారిపల్లి, మద్దిరేవుల ఈడిగపల్లె, తదితర గ్రామాల నుంచి వినాయక ప్రతిమలను బాణాసంచా నడుమ నిమజ్జనానికి తరలించారు. భక్తులకు దారిపొడవునా తీర్థ ప్రసాదాలను అందజేస్తూ లక్కిరెడ్డిపల్లి సమీపంలోని దొర్రిచెరువు వద్ద వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు.

రాజంపేట టౌన్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభమైన గణనాథ నిమజ్జన వేడుకలు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. వినాయక చవితి పండగ మూడవ రోజు నుంచి నిమజ్జన వేడుకలు ప్రారంభమై నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అందులో భాగంగా తొమ్మిదవ రోజైన ఆదివారం మండలంలోని అనేక ప్రాంతాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు.


పెనగలూరు: గుంజన నదిలో క్రేన్ సాయంతో గంగమ్మ ఒడికి చేరుతున్న పి.కొత్తపల్లె విఘ్నేశుడు

సంబేపల్లె : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో కొలువైన గణనాథులను ఆదివారం నిమజ్జనానికి తరిలారు. ఉదయం నుంచి ఆయా గ్రామాలలోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో విగ్రహాలను పురవీధులలో బాణసంచాలు కాలుస్తూ, డప్పువాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగించారు.